క్లుప్తంగా

ముక్కంటి సేవలో ఈజీఎస్ డైరెక్టర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం ఈజీఎస్ డైరెక్టర్ చిన్నతాతయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ సతీష్ మాలిక్, ఈజీఎస్ అధికారులు అంబుడ్స్ పర్సన్ రాసరాయనాయుడు, ఏపీడీ ప్రేమ్‌కుమార్, ఏపీఓ కృష్ణయ్య, ఈసీ మునిశేఖర్, టీఏలు మునిబాబు, నాగరాజు, స్వామిదాస్, గోవర్ధన్, హరికృష్ణ, వెంకటేశు పాల్గొన్నారు.

ఈకేవైసీ నుంచి పెన్షనర్లకు మినహాయింపు ఇవ్వరూ!

శ్రీకాళహస్తి: ఈకేవైసీ నుంచి పెన్షనర్లకు మినహాయింపు ఇవ్వాలని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు బి.వెంకయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 11న ప్రభుత్వ జారీ చేసిన జీఓ నంబర్ 7 ప్రకారం 20వ తేదీలోపు పెన్షనర్లు ఈకేవైసీ చేసుకోవాలని ఆదేశించిందని, వృద్ధాప్య సమస్యలు, రుగ్మతలతో ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్న వారికి ఈకేవైసీ చేయించుకోవడం ఇబ్బంది అని, దీనిని దృష్టిలో ఉంచుకుని మినహాయింపు ఇవ్వాలని కోరారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



పూడిలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పూడి గ్రామ హైస్కూల్ ఆవరణలో బుధవారం చాగణం లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్ట్ ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించింది. శిబిరంలో దాదాపు 150 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి కొందరిని ఆపరేషన్లకు ఎంపికచేశారు. శ్రీశుకబ్రహ్మాశ్రమం ఆధ్వర్యంలో ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీ.బలరామయ్య, చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ అధినేత చాగణం గౌరీ శంకర్, స్పందన సంస్థ కార్యదర్శి బాలమురళి, హేమంత్, శ్యామ్, శేషయ్య, శంకర్‌నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని కంచనపల్లె గ్రామ సమీపంలో బుధవారం కోడి పందాలు నిర్వహిస్తున్న వారిపై దా డి చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. వారి నుంచి రూ.3100 నగదు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని ఇరుపాక్షిపురం గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

ఆలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అంతర్గత బదిలీ చేశారు. పలువురు అధికారులు, ఉద్యోగులను ఓ విభాగం నుంచి మరో విభాగానికి బదిలీ చేస్తూ ఈవో సాగర్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 20మందిని బదిలీ చేశారు.

సహపంక్తి భోజనం సంతోషదాయకం



మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు: పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులతో కలసి సహపంక్తి భోజనాలు చేయడం ఎంతో సంతోషదాయకమని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అక్కడ పనిచేసే పోలీసులు తమ కుటుంబ సభ్యులతో కలసి బుధవారం గెట్ టూ గెదర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో పని చేసే సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో కలసి గెట్ టూ గెదర్‌లో పాల్గొని సహపంక్తి భోజనాలు చేయడం వంటి వినూత్న కార్యక్రమం పోలీస్ అధికారులతోపాటు, సిబ్బందిలోనూ కొత్త ఉత్సాహాన్ని తెచ్చిపెట్టిందన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన, టూటౌన్ సీఐ వెంకటేశ్వరరావును డీఎస్పీతోపాటు, సిబ్బంది కూడా అభినందించారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ

పెళ్లకూరు: సంక్రాంతి పండుగల్లో భాగంగా బుధవారం శిరసనంబేడు గిరిజనులకు వేలూరు మురళీకృష్ణారెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. కాలనీలోని సుమారు 200 మందికి పైగా గిరిజనులకు చీరలు, లుంగీలు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుంటపూడి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈఏపీ రోడ్లకు నిధులు మంజూరయ్యేనా?

- అర్ధాంతరంగా ఆగిన గ్రామీణ రోడ్ల నిర్మాణం
- కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల కాని నిధులు



పులివల్లం గ్రామ పంచాయతీలో ఆగిన బీఎస్‌పేట రోడ్డు పనులు

వరదయ్యపాళెం: మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల రోడ్లకు రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ద్వారా పనులు మంజూరయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఐయూ ఆధ్వర్యంలో ఈఏపీ ద్వారా మండలంలో కురింజల్లం, వడ్డిపాళెం, బీఎస్‌పేట, ముస్లింపాళెం, లక్ష్మీపురం కే. కోవూరుపాడు, గోపాలరావు కాలనీ, రామిరెడ్డిపాళెం గ్రామాల రోడ్ల అభివృద్ధికి సుమారు రూ. 3కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే పనులు పొందిన కాంట్రాక్టర్ ఏడాదిన్నర క్రితం ఆయా రోడ్డు మార్గాల్లో కల్వర్టుల నిర్మాణం, మట్టి పనులను కొంతవరకు చేశారు. దీనికి సంబంధించి తొలి విడత బిల్లుల కోసం ప్రభుత్వానికి నివేదించారు. నిధులు మంజూరు కాకపోవడంతో ఏడాదిన్నర కాలంగా పనులకు స్వస్తి పలికారు. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే మార్గాల్లో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలు కురిసిన సమయంలో మార్గాల్లో మరీ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై ఎంపీడీఓకు సంబంధిత గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు సైతం అందాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేకు సైతం ఆగిన రోడ్ల పనుల గురించి స్థానికులు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు. ఇకనైనా నిధులు మంజూరు చేసి, రోడ్ల పనులకు మోక్షం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా వేమలమ్మకు పొంగళ్లు





పొంగళ్లు పెడుతున్న గ్రామస్తులు , వేమలమ్మకు పూజ చేస్తున్న పూజారి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామ దేవత వేమలమ్మకు బుధవారం గ్రామస్తులు ఘనంగా పూజలు చేసి పొంగళ్లు పెట్టారు. అమ్మవారి విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ అనంతరం వేమలమ్మకు పొంగళ్లు పెట్టటం ఆనవాయితీ.

క్వారీ టిప్పర్లతో సమస్యలు

- సమీక్షించిన అధికారులు
- సమస్యలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరిక

సత్యవేడు: సత్యవేడులోని గ్రావెల్ క్వారీల యజమానులతో బుధవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు సమీక్షించారు. తహసీల్దార్ టివి. సుబ్రమణ్యం మాట్లాడుతూ, , క్వారీల లారీలు ఓవర్‌లోడుతో వెళ్లడం, టిప్పర్లు పట్ట లేకుండా వేగంగా వెళ్తుండడంతో దుమ్ము రేగుతూ వాతావరణ కలుషితమవుతోందని, రోడ్లు దెబ్బతింటున్నాయని స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో క్వారీల సమస్యపై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీనిపై క్వారీ యజమానులు మాట్లాడుతూ, ప్రభుత్వ నియమ నిబంధనలు పాటిస్తామని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తామని, దుమ్ము రేగకుండా టిప్పర్లపై పట్టలు కప్పుతామని తెలిపారు. ఇక నుంచి క్వారీల మూలాన ఇబ్బందులు పునరావృతమైతే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ బాలగణేశన్, ఎస్ఐ పురుషోత్తం రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కే. సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే. చంద్రశేఖర్ రెడ్డి, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామారావుకు ఘన నివాళి

నారాయణవనం: సినీ నటుడు, మాజీ సీఎం ఎన్టీ రామారావు వర్ధంతి పురస్కరించుకుని ఘన నివాళులు అర్పించారు. బుధవారం నారాయణవనంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఉదయం పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అలాగే పాలమంగళం ఉత్తరపు కండ్రిగ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సినీ రంగానికి, రాష్ట్రానికి చేసిన సేవలను స్మరించారు. అనంతరం అన్నదానం చేశారు. ఎన్టీఆర్ అభిమానులు భాస్కరన్, సుబ్రమణ్యం, కేఎస్.రవి, రమేష్, శరవణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కోలాటం, భజనకు అవకాశం కల్పించరూ!

- పూడి గ్రామస్తుల వినతి



పవిత్రారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పూడి గ్రామస్తులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహా శివరాత్రి పర్వదినాన కోలాటం, భజన చేయడానికి వేమాలమ్మ నాట్యమండలి తరపున అవకాశం కల్పించాలని మండలంలోని పూడి దళితవాడ గ్రామస్తులు బుధవారం మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పవిత్రారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పూడి గ్రామ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చెరకు నరసింహనాయుడు, బుజ్జిరెడ్డి, నాగరాజు, తాళ్లూరు మురళి, సాయి ప్రసాద్, బాలు హరీష్, చెంగయ్య, భజన గురువు చిన్న ఎల్లయ్య, గ్రామస్తులు, భజనబృందం సభ్యులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షేక్ బాషా

శ్రీకాళహస్తి: స్థానిక పిట్టలవారిసందుకు చెందిన షేక్ బాషా(46) బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇతడు తోపుడుబండిపై పండ్ల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పు తీసుకున్న వ్యక్తి నుంచి ఒత్తిళ్లు పెరగడంతోపాటు బుధవారం రాత్రి వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అతడు కూరగాయల మార్కెట్ వద్ద పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. 1వ పట్టణ పోలీసులు బాధితుని నుంచి వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గౌరమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

భక్తిప్రపత్తులతో నిమజ్జనం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బుధవారం గౌరమ్మ నిమజ్జనం కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి నెల పాటు మహిళలు ప్రతిరోజూ సాయంత్రం గ్రామంలో గౌరమ్మ ప్రతిమను ఏర్పాటు చేసి గొబ్బిళ్లు తట్టి, భక్తి గీతాలు పాడుతారు. పండుగల చివరి రోజున నిమజ్జనం చేయడం పరిపాటి. స్థానిక నాలుగు వీధుల్లోని మహిళలు గొబ్బెమ్మకు ఘనంగా పూజలు చేశారు. వినాయక వీధి, దేవాలయం వీధి, తూర్పుమిట్ట వీధుల్లో అన్నదానం చేశారు. అనంతరం గౌరమ్మ ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

అభివృద్ధి పనులకు మంత్రి భూమి పూజ

- జీజీఎంపీ ఫండ్స్ రూ.20 లక్షలు
- ఎమ్మెల్యే ఫండ్స్ నుంచి మరో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు
- రోజా చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో 700 సిమెంట్ బస్తాల పంపిణీ



పుత్తూరు రూరల్: సిమెంట్ బస్తాలను పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: పుత్తూరు రూరల్ మండలం తిరుమలకుప్పం దళితవాడ బుధవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తిరుమలకుప్పం సచివాలయ పరిధిలో జీజీఎంపీ ఫండ్స్ రూ.20 లక్షలతో పాటు ఎమ్మెల్యే ఫండ్స్ నుంచి మరో రూ.10 లక్షలతో మొత్తం రూ.30 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డు, ఇంటింటికీ తాగునీటి కొళాయి పనులకు మంత్రి భూమి పూజ చేశారు. గత ప్రభుత్వంలో పక్కా గృహాలు నిర్మించుకుని పూత పనులు ప్రారంభించని 20 కుటుంబాలకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 700 సిమెంట్ బస్తాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామన్నారు. సిమెంట్ బస్తాలు అందుకున్న వారు ఇళ్ల పూత పని పూర్తి చేసుకోవాలని కోరారు. నగరి నియోజకవర్గంలో పాత ఇళ్లు ఉన్న వారికి అవసరమైన సాయాన్ని ట్రస్ట్ నుంచి చేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి జగనన్న 32 లక్షల మందికి ఇంటి పట్టాలు ఇచ్చి, ఇళ్లు కట్టిస్తున్నారని, ఇది దేశంలోని ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్ద ఎత్తున చేయడం లేదని, ఆ ఘనత మన సీఎంకే దక్కిందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి, పీఆర్ డీఈఈ వినోద్‌రెడ్డి, ఎంపీడీఓ ఇందిర, గ్రామ సర్పంచ్ సరస, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ విమల, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు గోపియాదవ్, షణ్ముగం , వెంకటేష్, ఏసు, శ్రీజ, శ్యామ్‌కుమార్, గోపి, మునికృష్ణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మూలనెత్తంలో మురుగు కాలువల నిర్మాణానికి..

నగరి: మండలంలోని మూలనెత్తంలో మురుగు కాలువల నిర్మాణానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా భూమిపూజ చేశారు. ఈ ప్రాంతంలో వర్షం కురిస్తే నీరు నిల్వ ఉండి సమస్యగా మారేది. ఇటీవలే ఎంపీపీ సమస్య తీవ్రతను గుర్తించి మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించా రు. కాలువల నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూ రు చేయించారు. బుధవారం ఈ పనులకు భూమి పూజ చేశారు. ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, వెంకటలక్ష్మి, రామ్‌ప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌కుమార్, నాయకులు భాస్కర్ రెడ్డి, జయరామ్, యేసు, పరంధామన్ పాల్గొన్నారు.

గొబ్బియల్లో..!



నరసరాజు అగ్రహారంలో గొబ్బెమ్మకు పూజలు చేస్తున్న మహిళలు



గొబ్బిళ్లు తడుతున్న మహిళలు

సత్యవేడు: మండలంలోని నరసరాజు అగ్రహారం పంచాయతీలో గౌరమ్మ దేవికి ప్రత్యేకంగా మహిళలు గొబ్బిళ్లు తట్టి పూజలు చేశారు. పెద్ద పండుగ సందర్భంగా గొబ్బెమ్మకు ప్రత్యేక ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. బుధవారం సాయంత్రం గ్రామ మహిళలు గొబ్బెమ్మను కొలువు దీర్చి, వీధులలో గొబ్బెను తిప్పుతూ గొబ్బిపాటలు పాడుతూ నృత్యం చేశారు. ఇంటింటా బియ్యం, బెల్లం , పసుపు, కుంకుమను గొబ్బెమ్మకు అందజేశారు. ఇలా సేకరించిన బియ్యం, బెల్లంతో పొంగలి చేసి పంచిపెట్టారు. తొలుతనిర్వాహకులు పి. రామచంద్రయ్య, శివగామి, అరుణ అన్నదానం చేశారు.

'రక్తహీనత గర్భిణులు, పిల్లలను గుర్తించేందుకు సర్వే'



మాట్లాడుతున్న సీడీపీఓ దేవకుమారి

సత్యవేడు: రక్తహీనత కలిగిన గర్భవతులు, పిల్లలు వివరాలను ప్రతి సచివాలయం నోటీసు బోర్డులో ఉంచాలని సీడీపీఓ. దేవకుమారి ఆదేశించారు. రక్తహీనత కలిగిన గర్భవతులు ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీడీపీఓతోపాటు ఎంపీడీఓ బాలగణేశ్ మాట్లాడారు. పంచాయతీ పరిధిలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, పిల్లలను గుర్తించేందుకు రెండు రోజులో సరే పూర్తి చేయాలన్నారు. ఇదలా ఉంచితే, 24 తేదీ వరకు రాజగోపాలపురం, పెద్ద ఈటిపాకం పంచాయతీ సచివాలయ పరిధిలో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ చెప్పారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలతో చీడపీడల నివారణ



తేనెబంక నివారణ విధాన ప్లకార్డులను ప్రదర్శిస్తున్న క్షేత్ర సిబ్బంది

నారాయణవనం: వేరుశనగ పంట సాగులో ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తే చీడపీడలు, తెగుళ్లను పూర్తిగా నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ ఇన్‌స్ట్రక్టర్ నీలమ్మ అన్నారు. బుధవారం మండలంలోని గోవిందప్పనాయుడుకండ్రిగలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. చెంగమ్మ సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. అధిక మంచు కారణంగా తేనెబంక తెగులు ఆశించినట్లు గుర్తించారు. తెగులు నివారణకు నీమామృతం వాడాలని సూచించారు. 100 లీటర్ల నీటిలో 5 కేజీల వేపాకు, 5 లీటర్ల గోపంచితం, కేజీ ఆవు పేడ కలిపి 48 గంటల పాటు మగ్గనిచ్చి ఆ మిశ్రమాన్ని సాయంత్రం వేళ పిచికారీ చేయాలన్నారు. రసాయన ఎరువులు వాడకం వలన భూసారం క్రమేణా తగ్గి సరైన దిగుబడులు రావన్నారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



ఎరువులు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఊరందూరు సచివాలయ పరిధిలోని రైతులకు బుధవారం మండల వ్యవసాయాధికారి గంగలపూడి సుధాకర్‌రెడ్డి యూరియా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, మండలంలోని 22 సచివాలయాలకు ఇప్పటికే 1,200 టన్నులు యూరియా సరఫరా చేశామన్నారు. ఈ ఏడాది మండలంలో 5,100 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారని, వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు ఉపయోగించాలన్నారు. అధికంగా ఎరువులు వాడితే తెగుళ్లు ఆశించి దిగుబడి తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో ఊరందూరు సచివాలయం కన్వీనర్లు అమాస చంద్రశేఖర్‌రెడ్డి, దిద్దు రంగయ్య, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా కాలభైరవునికి పల్లకీసేవ



ఆలయంలో పల్లకిలో ఊరేగుతున్న కాలభైరవస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కాలభైరవ స్వామి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ప్రతి మంగళవారం రాత్రి ఏకాంత సేవ అనంతరం ఈ సేవ నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ అర్చకులు కరుణాకర్ గురుకుల్ ఆధ్వర్యంలో కాలభైరవస్వామికి పంచామృతం, విభూది, చందనం, కుంకుమ, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామి వారికి వడమాల, నిమ్మకాయల మాల, గజమాలతో అలంకరించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులను అలరించిన 'చిన్న కొండచుట్టు'



భేరివీధిలో చిన్న కొండచుట్టు సందడి

నగరి: పట్టణంలోని భేరివీధిలో బుధవారం నిర్వహించిన చిన్న కొండచుట్టు ఉత్సవాలు చిన్నారులను అలరించాయి. కొండచుట్టు ఉత్సవాలకు మరుసటి రోజున భేరివీధిలో చిరు వ్యాపారులు దుకాణాలు పెట్టడం పరిపాటి. దీంతో వీధిలో తిరనాళ్ల సందడి నెలకొంది. స్థానికులు దీన్ని చిన్న కొండచుట్టు ఉత్సవాలుగా పిలుచుకుంటారు. చిన్నారుల ఆటబొమ్మలు, మహిళలకు సంబంధించిన అలంకరణ వస్తువులు, చెరుకు గడలు, తినుబండారాలు ఇక్కడ అధికంగా విక్రయించారు. వివిధ రకాలైన రంగుల రాట్నాల్లో తిరగడానికి పిల్లలు ఉత్సాహం చూపారు. దీంతో వీధి మొత్తం జనంతో నిండిపోయింది.

గుండెపోటుతో రైతు మృతి

కలువాయి: పొలంలో పనిచేస్తుండగా గుండెపోటు వచ్చి ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందిన విషాద సంఘటన కలువాయి మండలం బ్రాహ్మణపల్లెలో బుధవారం జ రిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పెరుమాళ్ల శ్రీనివాసులు(35) బుధవారం తన పొలంలో యూరియా చల్లేందుకు ఇంటి నుంచి ఎరువు బస్తాను మోసుకుని పొలానికి వెళ్లాడు. పొలం గట్టున బస్తా దించి, మరో బస్తా తీసుకువచ్చేందుకు బయలు దేరుతుండ గా గుండె నొప్పి రావడంతో పొలంలోనే కుప్ప కూలిపోయాడు. సమాచారం అందుకున్న కు టుంబ సభ్యులు అక్కడికి వెళ్లే సరికే శ్రీనివా సులు మరణించాడు. కుటుంబ పెద్ద దిక్కును పోగొట్టుకున్నట్టు వారు ఆవేదన చెందారు.